ఈనాడు
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం అక్టోబరు 10, 2024

సరస్వతీ దేవిగా పెద్దమ్మతల్లి దర్శనం



పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: మండలంలో కొలువుదీరిన పెద్దమ్మ తల్లి.. సరస్వతీ దేవిగా భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేదమంత్రోచ్చారణల మధ్య సుమారు 80 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అంతకుముందు అమ్మవారికి రుద్రాభిషేకం, యాగశాలలో రుద్రహోమం జరిపించారు. అమ్మవారిని దేవాదాయ, ధర్మాదాయశాఖ ఖమ్మం జిల్లా సహాయ కమిషనర్ వీరస్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



నయనానందకరం.. విజయలక్ష్మి అమ్మవారి అలంకారం


భద్రాచలం, న్యూస్‌టుడే: విజయదశమి ఉత్సవాలు భద్రాచలం రామాలయంలో వైభవోపేతంగా సాగుతున్నాయి. వేడుకల్లో ఆరో రోజైన బుధవారం అమ్మవారు విజయలక్ష్మిగా దర్శనమిచ్చి మంత్రముగ్ధులను చేశారు. అర్చకులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని అలంకరించి పూజించారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు చేశారు. రామాయణ పారాయణం భక్తిప్రపత్తులతో సాగింది. గురువారం ఐశ్వర్యలక్ష్మి రూపంలో అమ్మవారు దర్శనమిస్తారు. అఖిలాండకోటి బ్రహ్మాండాలకు శాసకురాలు అమ్మ. కరుణా రూపిణి అయిన ఈ అమ్మవారి క్రీగంటి చూపుల కదలికలనే శాసనాలుగా భావించి శ్రీ మహా విష్ణువు సకల జగద్రక్షణ చేస్తుంటారని పండితులు వివరించారు.

నర్సరీలపై.. ఏదీ నజర్?



● ఆళ్లపల్లి మండలానికి చెందిన గొగ్గెల పాపారావు టేకులపల్లిలోని ఓ నర్సరీలో 2 వేల మిరప మొక్కల్ని కొనుగోలు చేశారు. బిల్లు ఇవ్వాలని కోరగా అందుకు నిర్వాహకుడు నిరాకరించాడు.

● టేకులపల్లి మండలం బద్దుతండాకు చెందిన బాల.. వర్షాలకు ముందు మిరప మొక్కలు నాటారు. వర్షాలతో చాలా మొక్కలు చనిపోవడంతో ఇటీవల మరో 2వేల మొక్కలు కొనేందుకు టేకులపల్లిలోని ఓ నర్సరీని సంప్రదించాడు. కనీసం అది ఏరకమో కూడా చెప్పలేదని రైతు వాపోయారు.



● ఇల్లెందు మండలం మాణిక్యారానికి చెందిన రైతు రమేశ్.. ఇల్లెందు మండలంలోని ఓ నర్సరీలో మొక్కలు కొన్నారు. బ్రాండ్ పేరైతే చెప్పారని, రశీదు అడిగితే ఇచ్చేది లేదన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఉభయ జిల్లాల్లో మిరప నారు, కూరగాయల మొక్కలను పెంచే నర్సరీలపై నజర్ కొరవడింది. కొందరు నిబంధనలు పాటించటం లేదు. లాభాలే ధ్యేయంగా ఈ ఏడాది నర్సరీలను పెద్దఎత్తున ప్రారంభించారు. కొన్నిచోట్ల కనీసం రశీదులూ ఇవ్వని పరిస్థితి. ఇకనైనా దృష్టిసారించాలని వ్యవసాయశాఖ అధికారులను రైతులు కోరుతున్నారు.

టేకులపల్లి, న్యూస్‌టుడే

ఖమ్మం జిల్లాలో 247, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 33 నర్సరీలను అనుమతితో నిర్వహిస్తున్నారు. వీటిల్లో ఇటీవల ఎక్కువగా మిరప నారు పెంచారు. వర్షాల నేపథ్యంలో కొన్నిచోట్ల తోటలు దెబ్బతినడం, కొందరు రైతులు మళ్లీ నాటుతుండటంతో ప్రస్తుతం మిరప మొక్కలకు గిరాకీ బాగా పెరిగింది. ఈ క్రమంలో పంట దిగుబడులను దృష్టిలో పెట్టుకొని రైతులు విత్తనాల వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, నిర్వాహకుల నుంచి నిర్లక్ష్య సమాధానమే ఎదురవుతోంది. 'అది ఏ రకం విత్తనం? కంపెనీ పేరేమిటి? లాట్ నంబరు ఎంత? ఆ వివరాలతో బిల్లు కావాలి' అని అడిగితే పెదవి విరుస్తున్నారు. బిల్లు ఇచ్చేది లేదని, ఇష్టం లేకుంటే వెళ్లిపోవాలని తేల్చిచెబుతున్నారు. దాదాపు చాలాచోట్ల ఇదే పరిస్థితి ఎదురవుతుండటంతో చేసేదేమీ లేక నారు కొనుగోలు చేస్తున్నారు.

నిబంధనలు ఇవీ..

- విత్తన కంపెనీ, లాట్, బ్యాచ్ నంబరు, తయారీ తేదీ, గడువు తేదీ తప్పనిసరిగా నారు పెంచే బెడ్ల ముందు రాసిపెట్టాలి.
- నారు విక్రయించిన తేదీ, పూర్తి వివరాలను రికార్డుల్లో పొందుపరచాలి.
- నర్సరీలో లభించే నార్లు, ఆయా రకాల మొక్కల సంఖ్య, ధరల వివరాల తెలుగు పట్టికను ప్రధాన ద్వారం వద్ద ప్రదర్శించాలి.
- పేరున్న, నాణ్యమైన కంపెనీల విత్తనాలతోనే నారు పెంచి విక్రయించాలి.
- స్టాక్ రిజిస్టర్‌ను ఇన్‌వాయిస్‌లు సహా సమగ్రంగా నిర్వహించాలి.
- ప్రతి నర్సరీకి రెండు ద్వారాలు ఏర్పాటు చేయాలి. కానీ ఈ నిబంధనలు ఎక్కడా పూర్తిగా అమలుకావటం లేదు.

"నర్సరీలో నారు కొనుగోలు చేసిన ప్రతి రైతుకూ రశీదు ఇవ్వాల్సిందే. నాణ్యమైన విత్తనాలనే వాడాలి. రైతులకు నాసిరకం మొక్కలను అంటగట్టి చేతులు దులిపేసుకుంటే ఊరుకునేది లేదు. ఉల్లంఘనులపై చట్టపరమైన చర్యలు తప్పవు. బాధిత రైతులు ఫిర్యాదు చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం."

- ఎంవీ మధుసూదన్, జిల్లా ఉద్యానాధికారి, ఖమ్మం

ఇలాగైతే.. ప్రతిరోజూ పండగే!



పండగ అంటే అయిన వారందరూ కలుసుకోవటం.. ఆనందాలను పంచుకోవటం.. గత స్మృతులను నెమరువేసుకోవటం.. పదికాలాల పాటు పదిలపరచుకునే మరిన్ని అనుబంధాలను మూటగట్టుకోవటం.. పండగ పూట ఇలాంటి మధురిమలు పొందాలంటే అందరూ కలిసి ఓ చక్కని ప్రణాళిక ఏర్పరచుకుంటే ఎంతో మేలు కదా..! - అశ్వాపురం, న్యూస్‌టుడే

..ఇదిగో మణుగూరుకు చెందిన రామారావు కుటుంబం.. కుమారుడు, కోడలు సెలవుల్లో హైదరాబాద్ నుంచి వచ్చారు. మనుమలు, మనుమరాళ్లు కూడా ఉన్నారు. ఇల్లంతా ఒకటే సందడి. అందరూ సరదాగా మాట్లాడుకుంటున్నారు. పండగను సంతోషంగా గడపాలనుకున్నారు. అందుకు ప్రణాళికను రూపొందించుకుంటున్నారు. 'ఒకప్పుడు పండగలు ఎంతో సంతోషంగా గడిచేవి. క్రమేణా కళను కోల్పోతున్నాయి. అందరూ కలిసినా పిల్లలు, పెద్దలూ సెల్‌ఫోన్లు, కంప్యూటర్లతోనే గడుపుతున్నారు. ఎవరికివారే ఒంటరిగా ఉంటున్నారు. పండగ వచ్చిందంటే నేనూ, నా స్నేహితులందరం సరదాగా పచ్చని పొలాలు, చెరువు గట్ల వెంట తిరిగేవాళ్లం. ప్రకృతి అందాలను ఆస్వాదించేవాళ్లం. తోటల్లో హాయిగా చెట్ల కింద సేదతీరేవాళ్లం. పండగ పూట ఆరోజంతా ఆనందంగా గడిచిపోయేది..' రామారావు మాటలు పూర్తికాకుండానే మనుమడు, మనుమరాళ్లు ఉత్సుకతతో చుట్టుముట్టారు. 'తాతయ్యా.. మాకూ పంటపొలాలు, చెరువు గట్లు చూడాలనుంది. మమ్మల్ని తీసుకెళ్లరూ..?' అంటూ మారాం చేశారు. 'వీడియో గేమ్స్ బంద్. బోరింగ్. సెలవు రోజులన్నీ మీతోనే గడుపుతాం తాతయ్యా..' అంటూ పిల్లలు భీష్మించారు.

బంధుమిత్రులతో కులాసాగా కబుర్లు

కోడలు శ్రీలత మాట్లాడుతూ.. 'నిజమే మామయ్యా.. ఈ కాలంలో అయినవారితో మాటలు, యోగక్షేమాలు సెల్‌ఫోన్ల వరకే పరిమితమవుతున్నాయి. వ్యక్తిగతంగా వారిని కలవటం, ఆనందాలను పంచుకోవటం పూర్తిగా తగ్గిపోయింది. దసరా పండగ సెలవు రోజుల్లో గ్రామంలోని మన బంధుమిత్రులందరినీ కలుసుకుంటాను. వారితో ఆనందంగా గడుపుతాను' అని బదులిచ్చారు.

దినపత్రికలు, పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన

కుమారుడు తరుణ్ జోక్యం చేసుకుంటూ ' పుస్తకాలు, దినపత్రికలు చదవటమూ తగ్గిపోయింది. ఎంతసేపూ సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలు అంటూ వాటిని అనుసరించటానికే సరిపోతోంది. వాటివల్ల అవగాహన స్థాయి పెరగదు. అనుభూతీ కలగదు. జ్ఞాపకశక్తి పెంపొందదు. పైగా ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చు. అదే ఏదైనా ఓ మంచి పుస్తకం, దినపత్రిక చదివితే కలిగే ఆనందం వేరు. దినపత్రికల్లోనూ ఇటీవల చాలా మార్పులొస్తున్నాయి. సూటిగా, స్పష్టంగా తక్కువ వాక్యాల్లోనే కీలక విషయాలు, భావాలను అవి చెబుతున్నాయి. దినపత్రికలు, పుస్తక పఠనం వల్ల సమాజ పోకడ అవగతమవుతుంది. వివేకం పెంపొందుతుంది. ఈ సెలవు రోజులన్నీ సెల్‌ఫోన్‌ను పక్కనపెట్టి మీ అందరితో గడుపుతూ రోజూ దినపత్రిక చదివేందుకు కాసింత సమయం వెచ్చిస్తా.. ఓ మంచి పుస్తకం చదవాలనుకుంటున్నాను..'అని స్పష్టం చేశారు.

ఆచరిస్తే.. ఆనందాలే..

కుటుంబ సభ్యులందరూ కలిసి బుధవారం పిండివంటలు చేసుకున్నారు. పిల్లలు.. తాతయ్య వెంట పచ్చని పొలాలు, చెరువు గట్లను సందర్శించారు. పంటకాల్వల్లో కాగితం పడవలు వదిలి కేరింతలు కొట్టారు. పూల తోటల్లో విహరించారు. చెట్ల కింద ఆటలాడారు. ఆరుబయట వారికవన్నీ అదే తొలిసారి. కోడలు ఊళ్లోని బంధుమిత్రుల ఇళ్లకు వెళ్లారు. వారితో ఆనందంగా కబుర్లు చెప్పి అందరి ప్రేమాభిమానాలను చూరగొన్నారు. కుమారుడు అందరితో సంతోషంగా గడుపుతూనే పుస్తకం చదువుతున్నారు. చక్కని అనుభూతిని మిగుల్చుకుంటున్నారు. ఈసారి వారింట్లో మునుపెన్నడూ లేని రీతిలో పండగ ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి..!

తంగేడు బంగారమే అయింది!



సద్దుల బతుకమ్మ నేపథ్యంలో తంగేడు పూల కోసం ఎదురవుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఒకప్పుడు ఎక్కడపడితే అక్కడ కనిపించే తంగేడు చెట్లు, పూలు ఇప్పుడు కనిపించడం లేదు. ఈ ఏడాది తంగేడు బంగారమే అయింది. ఫలితంగా ఆ పూల కోసం అడవులు, కొండలు, గుట్టల బాట పట్టాల్సి వస్తోంది. అశ్వాపురం మండలం మొండికుంటవాసులు అడవి నుంచి తంగేడును ఇలా తీసుకొస్తున్నారు. - అశ్వాపురం, న్యూస్‌టుడే

పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయుధ పూజ

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రుల సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయుధ పూజ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయుధాలను పూజించి, వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. అధికారులు, సిబ్బందికి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయగా, వారికి ఎస్పీ రోహిత్‌రాజు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఓఎస్‌డీ టి.సాయిమనోహర్, కొత్తగూడెం, పాల్వంచ డీఎస్పీలు షేక్ అబ్దుల్ రెహ్మాన్, సతీశ్‌కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆయుధ పూజలో పాల్గొన్న ఎస్పీ రోహిత్‌రాజు, పోలీసు అధికారులు

బతుకు దెరువుకు వారు.. బరితెగించి వీరు!

కొత్తగూడెం పట్టణం: అవకాశం దొరికితే చాలు.. కొత్తగూడెం పురపాలికలో కొందరు దందాకు తెరదీస్తున్నారు. ఇక్కడంతా గుత్తేదారులదే ఇష్టారాజ్యం. గురువారం సద్దుల బతుకమ్మ నేపథ్యంలో అడవి నుంచి సేకరించిన తంగేడు, సీతమ్మ జడ తదితర పూలను విక్రయించేందుకు చిరు వ్యాపారులు, గిరిజనులు ఎంజీ రోడ్ ఫుట్‌పాత్ పక్కన దిగారు. రోజువారీ సంత పాట దక్కించుకున్న కొందరు గుత్తేదారుల ప్రతినిధులు (గుమాస్తాలు) వారి వద్ద ముక్కుపిండి మరీ రూ.100 చొప్పున బుధవారం రాత్రి వసూలు చేశారు. నిబంధనల ప్రకారం చిరు వ్యాపారుల నుంచి రూ.25 రుసుము వసూలు చేసుకోవాలని నిర్ణయించినా చేతివాటం ప్రదర్శించారు. కొందరు గిరిజనులు, వ్యాపారులు లబోదిబోమన్నా వినలేదు. బెదిరించి మరీ డబ్బులు అడగడంతో నిస్సహాయతను వ్యక్తం చేశారు. రుసుంతో పాటు కొందరు గుమాస్తాలు అదనంగా తంగేడు పూలను బలవంతంగా పట్టుకెళ్లారు. ఇలాంటి వసూళ్ల పర్వానికి పురపాలక అధికారులు అడ్డుకట్ట వేయాలని చిరువ్యాపారులు కోరుతున్నారు.



ఎంజీరోడ్‌లో పూల వ్యాపారిని డబ్బులు డిమాండ్ చేస్తున్న గుమాస్తాలు


413 మందికి ఉపాధ్యాయ నియామక పత్రాలు

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఇటీవల వెల్లడించిన డీఎస్సీ ఫలితాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు, పీఈటీ, పీడీ పోస్టులు కలిపి మొత్తం 447 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. ఇటీవల ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేసుకున్న 413 మంది అభ్యర్థులకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి నియామక పత్రాలను బుధవారం అందజేశారు. అంతకు ముందు ఉదయం 4 గంటలకే పది ప్రత్యేక బస్సుల్లో అభ్యర్థులను హైదరాబాద్ తీసుకెళ్లారు. అల్పాహారం, భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు సైదులు, సతీశ్‌కుమార్, ఎంఈఓ ప్రభుదయాళ్, ఫైనాన్స్, అకౌంటింగ్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మహిళా అభ్యర్థికి నియామక పత్రం అందజేస్తున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

పండగొస్తోంది.. పింఛనేదీ?



చుంచుపల్లి, న్యూస్‌టుడే: వివిధ ప్రభుత్వ శాఖల్లో సుదీర్ఘకాలం పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారి ఖాతాల్లో పింఛన్ జమ చేయడంలో ఆలస్యం జరుగుతోంది. ప్రస్తుతం దసరా పండుగ సమయంలోనూ పింఛన్ ఇవ్వకపోవడంపై విశ్రాంత ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పింఛను పొందుతున్న విశ్రాంత ఉద్యోగులు 5,373 మంది ఉన్నారు. వీరికి సంబంధించిన పింఛన్ మంజూరుకు పది బిల్లులను నెలనెలా రూపొందించి జిల్లా ఖజానాధికారికి శాఖల వారీగా అందజేస్తుంటారు. ఆ తర్వాత సుమారు రూ.25 కోట్లు ఖాతాల్లో జమచేస్తుంటారు. సెప్టెంబరు నెలకు సంబంధించి ఇప్పటివరకు మూడు బిల్లులు క్లియర్ అయ్యాయి. 1,440 మంది విశ్రాంత ఉద్యోగులకు ఈ నెల 1, 2 తేదీల్లో పింఛన్ నగదు ఖాతాల్లో పడింది. ఇంకా ఏడు బిల్లులకు సంబంధించి 3,933 మందికి ఈ నెల 9 వరకు నగదు జమ కాలేదు. దసరా పండగ సమయంలోనూ పింఛను ఆలస్యం కావడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఈ విషయాన్ని జిల్లా ఖజానాధికారి దృష్టికి తీసుకెళ్లగా, సాంకేతిక కారణాల వల్ల నగదు జమ కాలేదనే సమాధానం చెప్పారు. నేడు, రేపు అంటూ సమస్యను దాటవేస్తున్నట్లు పలువురు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రతినిధులు కొందరు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఉన్నతాధికారులు స్పందించి సత్వరమే సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

◆ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెస్లీ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ జిల్లా ఖజానాధికారి దృష్టికి సమస్యను వివరించినట్లు చెప్పారు. ఆ శాఖ అధికారులను వివరణ కోరగా.. కొందరు పింఛనర్ల నగదు సాంకేతిక సమస్యతో జాప్యమైందని, వీలైనంత త్వరగా ఖాతాల్లో జమ చేస్తామని పేర్కొన్నారు.

1.50 లక్షల ఎకరాల్లో మునగ సాగు లక్ష్యం

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో మునగ సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఎంలు, వ్యవసాయాధికారులతో కలెక్టరేట్ నుంచి బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నర్సరీల్లో మునగ, మొరింగా, అజోల్ల, కెనాల్ బండ్ తదితర ప్లాంటేషన్లు పెంచాలని కలెక్టర్ సూచించారు. 'మహిళా శక్తి' యూనిట్ల సభ్యులు చేపలు, పుట్టగొడుగులు, నాటు కోళ్ల పెంపకానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. ఆహార పదార్థాలు, సంప్రదాయ వంటలు, పచ్చళ్ల తయారీ, క్యాంటీన్ల నిర్వహణపై స్వయం సహాయక సంఘాలు దృష్టి పెట్టాలన్నారు. పీఎం విశ్వకర్మ యోజన ద్వారా 18 రకాల చేతివృత్తుల వారు రుణం పొందేందుకు అవకాశం ఉందని తెలిపారు. అర్హులైన వారికి అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు, అంతర్గత రహదారుల నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పంచాయతీల్లోని ఖాళీ స్థలాలు, చెరువులు, కుంటల గట్లపై మొక్కలు విరివిగా నాటాలని ఆదేశించారు. అంతర్ పంటలు, కూరగాయలు, ఫామ్ పాండ్, కోకో సాగుపై రైతులు దృష్టిపెట్టేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారి చంద్రమౌళి, అదనపు డీఆర్‌డీఓ ఎన్.రవి, జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ పృథ్వీ, శ్రీనిధి ఆర్.ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్

చిట్టి ఉపాయంతో చిట్టడవులు

టేకులపల్లి, న్యూస్‌టుడే

సింగరేణి యాజమాన్యం బొగ్గు వెలికితీతతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తోంది. ఉపరితల గనుల ఏర్పాటు కోసం సింగరేణి యాజమాన్యం రెవెన్యూ, ప్రభుత్వ, అటవీభూములను సేకరిస్తుంటుంది. సేకరించిన భూమికి నష్ట పరిహారం, నిర్వాసితులకు పునరావాసం, అటవీ శాఖ కోల్పోయిన భూమికి మరో దగ్గర భూమిని కేటాయించటం ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియ. తమ ఆధీనంలోని భూముల్లో ఓబీ డంప్‌లపై మొక్కలు పెంచి వాటిని అభివృద్ధి చేసి బొగ్గు నిల్వలు పూర్తయిన తర్వాత అవే భూములను మళ్లీ అటవీశాఖకు కేటాయించాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. ఇల్లెందు, కొత్తగూడెం ఏరియాల్లో ఓబీ డంప్‌లపై పెంచిన ప్లాంటేషన్లను భవిష్యత్తు అవసరాల దృష్ట్యా తిరిగి అటవీశాఖకు ఒప్పందాల మేరకు ఇవ్వనుంది.

చేపట్టింది ఇలా..

ఉపరితల గనుల కోసం సేకరించిన భూముల్లో బొగ్గును వెలికితీస్తుండగానే మట్టితీత పనులు జరిగాయి. వచ్చిన ఓబీ మట్టిని పెద్దపెద్ద గుట్టలుగా నిర్మించారు. ఈ గుట్టలపై సింగరేణి యాజమాన్యం ఒక హెక్టార్‌కు 2,500 చొప్పున మొక్కలు నాటింది. 80శాతం వరకు మొక్కలు నాటుకుంటాయని అధికారులు చెబుతున్నారు. మారేడు, ఉసిరి నారవేప, ఎగిస, బండారు, వెలగ, వెదురు తదితర అడవిజాతి మొక్కలను ఓబీ డంప్‌లపై పెంచుతున్నారు. హెక్టార్‌కు రూ.40-50వేల వరకు ఖర్చు చేశారు. మొక్కలు నాటిన తరువాత సుమారు రెండేళ్ల వరకు పర్యవేక్షిస్తారు. ఆ తర్వాత వర్షాధారితంతో మొక్కలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం కొన్నిచోట్ల చిట్టడవులను తలపిస్తున్నాయి.



కేఓసీలో ఓడీ డంప్‌లపై సింగరేణి యాజమాన్యం పెంచుతున్న మొక్కలు

ఏ ఏరియాల్లో ఎంతెంత అటవీశాఖకు ఇస్తున్నారంటే..

(హెక్టార్లలో)

ఇల్లెందు ఏరియా..
- కేఓసీ - 130
- జేకేఓసీ - 151

కొత్తగూడెం
- జీకేఓసీ - 25

భూముల కొరతను అధిగమించేందుకే..

నూతన గనుల ఏర్పాటులో ఎక్కడైతే ఫారెస్ట్ బ్లాక్ కోల్పోతుందో.. అటవీశాఖ పరిధిలోని భూమిని సింగరేణికి కేటాయిస్తున్నారో దానికి సరిపడా భూమి, అడవిని మరోచోట సింగరేణి యాజమాన్యం అటవీశాఖకు అప్పగించాలి. గతంలో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో సింగరేణి యాజమాన్యం రెవెన్యూ భూములను కొని అటవీశాఖకు కేటాయించేది. ప్రస్తుతం రెవెన్యూ భూములు దొరకటం కష్టతరంగా మారింది. ఈ సమస్యను అధిగమించటానికి సింగరేణి ఇలాంటి ఆలోచనలకు శ్రీకారం చుట్టింది.

గనుల ఏర్పాటుకు అటవీశాఖ భూములను సింగరేణి యాజమాన్యం తీసుకున్నట్లయితే అటవీశాఖకు మరోచోట భూములు చూపించాల్సి ఉంటుంది. భూసేకరణ కష్టతరంగా మారింది. సమస్యను అధిగమించడానికి గతంలో సింగరేణి యాజమాన్యం ఆధీనంలోని ఓబీ డంప్‌లపై అడవిని పెంచి తిరిగి ఫారెస్ట్‌కు అప్పగిస్తున్నాం. తద్వారా నూతన మైన్ల ఏర్పాటుకు అటవీశాఖ అనుమతులు త్వరితగతిన లభిస్తాయి.

- హరినారాయణ, ఫారెస్ట్ డీజీఎం, కొత్తగూడెం

మదిని దోచే కిన్నెరసాని అందాలు



చుట్టూ పచ్చదనాలు పరుచుకున్న కొండలు.. ఉరకలెత్తే అలల సోయగాలు.. వెరసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయం పర్యాటకుల మది దోచేస్తోంది. సంధ్యా సమయం వేళ అబ్బురపరుస్తున్న కిన్నెరసాని వన్నెలను స్వీయచిత్రాల్లో బంధించేందుకు సందర్శకులు పోటీపడుతున్నారు. – ఈనాడు, ఖమ్మం పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే

అరుదైన రీతిలో.. అరటి హస్తం..!



సహజంగా రెండు అరటిపండ్లు కలసి ఉంటే జంట పండ్లు లేదా కవల పండ్లు అని అంటుంటారు. ఆలాంటిది మధిరలో బుధవారం ఏకంగా 8 అరటిపండ్లు కలసి ఉన్న హస్తం ఓ వ్యాపారి వద్ద అరటిగెలకు వచ్చింది. ఆ వ్యాపారి వాటిని విడదీయకుండా స్థానిక ప్రధాన వీధిలోని విఘ్నేశ్వర ఆలయంలో స్వామివారి ముందు ఉంచమని పూజారి రవిశాస్త్రికి అందజేశారు. స్థానికులు, భక్తులు వీటిని ఆసక్తిగా తిలకించారు. దీనిపై జిల్లా ఉద్యాన అధికారి జి.మరియన్న 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో, జన్యుమార్పిడితో రెండు, మూడు అరటి కాయలు కలసి ఉంటాయి. ఎనిమిది అరటికాయలు కలసి ఉండటం అరుదేనని తెలిపారు. – మధిర, న్యూస్‌టుడే

నైపుణ్యంపై ఆసక్తి.. సంపాదన శక్తి

పాల్వంచ, న్యూస్‌టుడే

చదువుతో నిమిత్తం లేదు. కావాల్సిందల్లా ఏకాగ్రత. కాస్త ఓపిక చేసుకుని శిక్షణ పొందితే చాలు.. జీవనోపాధి తథ్యం. కొందరు వనితలు అబ్బురపరిచే తాటాకు ఉత్పత్తులను తమ సృజనాత్మకతతో రూపొందిస్తున్నారు. వీరు రూపొందించే రంగురంగుల బుట్టలు, గృహాలంకరణ వస్తువులకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంటోంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లోనే కాకుండా.. సింగపూర్, అమెరికా, శ్రీలంక, ఆస్ట్రేలియాలకు ఆన్‌లైన్ ఆర్డర్లపై సరఫరా చేస్తుండటం విశేషం. తాటాకు అల్లికలపై పాల్వంచలోని నవ లిమిటెడ్ వారి కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా అందించే మూణ్నెల్ల శిక్షణను ఎంతో మంది మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇక్కడి సాధికారత కేంద్రం మహిళా స్వావలంబనకు ఏడేళ్లుగా కృషిచేస్తోంది. స్థానికులతో పాటు కొత్తగూడెం, ఇల్లెందు పట్టణాలు, సమీప మండలాలకు చెందిన సుమారు 200 మందికి పైగా స్వయం ఉపాధి పొందుతుండటం విశేషం. ఆసక్తి ఉన్నవారెవరైనా ఇక్కడ శిక్షణ పొందే అవకాశం ఉంది.



తాటి ఆకులతో వివిధ ఉత్పత్తులు తయారు చేస్తున్న మహిళలు

కుటుంబ పోషణకు సరైన మార్గం

– స్వరూపరాణి, సంజయ్‌నగర్



చదువుతో సంబంధం లేకుండా మహిళా సాధికారత కేంద్రంలో శిక్షణ ఇవ్వడం, ఉపాధి మార్గం చూపడం బాగుంది. తాటి ఆకులతో వివిధ రకాల ఆకృతులు తయారు చేయడంలో నైపుణ్యం సాధించా. ఈ కేంద్రంలో పనిచేయడం ద్వారా వచ్చే సంపాదనతో కుటుంబ పోషణకు అండగా నిలుస్తున్నా.

శిక్షణతో పాటు ఉపకార వేతనం

– పద్మ, మంచికంటినగర్



తాటి ఆకులతో తయారు చేసే ఆకర్షణీయ ఉత్పత్తులకు ప్రస్తుత మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఇంట్లో ఉంటూనే పలు ఉత్పత్తులు తయారు చేసుకుంటున్నాం. కుటుంబాలకు ఆర్థిక ఆసరాగా నిలవడం సంతోషంగా ఉంది. సంస్థ అందించే ఉచిత, ఉపకార వేతనంతో కూడిన శిక్షణను పేద మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్

– సత్యవతి, గాంధీనగర్



ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుందామని నవ లిమిటెడ్ వారి శిక్షణలో చేరా. సృజనాత్మకతతో వస్తువులు రూపొందిస్తుంటాం. మూణ్నెల్ల కాలం వేగంగా గడిచిపోయింది. వృత్తి నైపుణ్యంతో ఇప్పుడు మా కుటుంబానికి జీవనోపాధి లభించింది. నేను తయారు చేసే బుట్టలు, గృహాలంకరణ వస్తువులకు మంచి డిమాండ్ ఉండటంతో కుటుంబం గడిచేందుకు సంపాదన లభిస్తోంది.

ఖాళీ సమయం.. సద్వినియోగం

– పద్మ, గాంధీనగర్



కొన్నేళ్లపాటు ఇంట్లో ఖాళీగా ఉన్నా. ఆ సమయంలో ఏం చేయాలో పాలుపోలేదు. చివరకు ఉచిత శిక్షణ గురించి తెలిసి అక్కడ చేరా. కోర్సు పూర్తవక ముందే ఉపాధి కల్పిస్తుండటం మంచి అవకాశంగా భావించా. ఎంతో ఆసక్తితో, ఇష్టంతో నైపుణ్యాన్ని నేర్చుకున్నా. ఇలాంటి కార్యక్రమాలు మహిళలకు ఆర్థికంగా భరోసా కల్పిస్తాయనడంలో సందేహం లేదు.

రాములోరికి ఘనంగా తిరుమంజనం



భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో బుధవారం తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. కోదండ రాముడికి అర్చకులు సుప్రభాతం పలికి నామార్చనలు నిర్వహించారు. క్షేత్ర విశిష్టతను వైదిక పెద్దలు ప్రవచించారు. సీతమ్మవారికి యోక్త్రధారణ, రామయ్యకు యజ్ఞోపవీతధారణ చేయించారు. మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక పరమానందకరంగా సాగాయి. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ కుటుంబ సమేతంగా వచ్చి రామయ్యను దర్శించుకున్నారు. ఈయనకు ఏఈఓ భవానిరామకృష్ణారావు, పీఆర్వో సాయిబాబా స్వాగతం పలకగా.. వేద పండితుడు ఆశీర్వచనం అందించారు.

టెన్నిస్‌లో ఇన్‌స్పెక్టర్ల ప్రతిభ



సీఐలు సతీశ్, రామరాయులును అభినందిస్తున్న సునీల్‌దత్

ఖమ్మం నేరవిభాగం: రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కె.సతీశ్, ఎం.రామరాయులు జంటను సీపీ సునీల్‌దత్ తన కార్యాలయంలో బుధవారం అభినందించారు. ఈ నెల 3 నుంచి హైదరాబాద్ వశిష్ఠ టెన్నిస్ అకాడమీలో జరిగిన హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంటులో 30 ఏళ్ల విభాగంలో ఇన్‌స్పెక్టర్లు రన్నర్‌గా నిలిచారు.

మావోయిస్టు వాల్‌పోస్టర్ల కలకలం

బూర్గంపాడు, న్యూస్‌టుడే: మండలంలో మావోయిస్టు వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు కలకలం రేపాయి. సందెళ్లరామాపురం అటవీ ప్రాంతంలో మణుగూరు-పాల్వంచ ఏరియా కమిటీ, బీకేఏఎస్ఆర్ డివిజన్ కమిటీ పేరిట మంగళవారం అర్ధరాత్రి ఫ్లెక్సీలు వెలిశాయి. మావోయిస్టు పార్టీ వార్షికోత్సవాలను విప్లవోత్సాహంతో నిర్వహించుకోవాలని పోస్టర్లలో ముద్రించి ఉంది. ఆపరేషన్ కగార్ దాడిని ఓడించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ ఘటనపై అదనపు ఎస్సై నాగభిక్షంను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా మావోయిస్టు వాల్ పోస్టర్లు వెలిసిన ప్రాంతాన్ని పరిశీలించి విచారణ చేపట్టామని తెలిపారు.

పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయాలి: డీటీసీ

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: జిల్లా రవాణాశాఖకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్(డీటీసీ) డాక్టర్ పుప్పాల శ్రీనివాసరావు ఆదేశించారు. ఖమ్మం జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం అధికారులు, ఉద్యోగులతో సమావేశమయ్యారు. దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా మెరుగైన సేవలు అందించాలన్నారు. నిర్వహణలో లోపాలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. జిల్లాలో శాఖాపరమైన ప్రభుత్వ లక్ష్యం 95 శాతం, త్రైమాసిక పన్నుల వసూళ్లలో 101 శాతం పురోగతి సాధించినట్లు డీటీసీ వెల్లడించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచి ఆదాయాన్ని పెంచాలని ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. జిల్లాలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్(ఐటీడీఆర్)కు స్థలం మంజూరు కావాల్సి ఉందనారు. సత్తుపల్లి ఆర్టీఏ కార్యాలయం నూతన భవన నిర్మాణంపై కమిషనర్‌కు రిపోర్టు ఇచ్చామన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి డీటీఓ, ఖమ్మం ఎంవీఐ వాకదాని వెంకటరమణ, ఏఎంవీఐ రెంటాల స్వర్ణలత, ఏఓ జావెద్ అలీ, ఉద్యోగులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డీటీసీ శ్రీనివాసరావు

అంకుర హాస్పిటల్ ప్రారంభం



అంకుర హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆసుపత్రి డైరెక్టర్ డా. రాకేశ్

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలో నూతనంగా నెలకొల్పిన అంకుర హాస్పిటల్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఔట్ పేషెంట్ విభాగాన్ని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నియోనాటల్ ఐసీయూను లోక్‌సభ సభ్యుడు రామసహాయం రఘురాం రెడ్డి బుధవారం ప్రారంభించారు. స్థానిక సీక్వెల్ రిసార్ట్స్ రోడ్డులో 120 పడకలతో నూతన హాస్పిటల్ నిర్మించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రులు మాట్లాడుతూ.. యాజమాన్యం నాణ్యమైన వైద్య సేవలను అందించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. అత్యాధునిక పరికరాలతో హాస్పిటల్ యాజమాన్యం జిల్లావాసులకు మెరుగైన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. వ్యవస్థాపకులు వున్నం కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. తల్లీ పిల్లల ఆరోగ్య సంరక్షణకు అంకుర బృందం నిరంతరం శ్రమిస్తోందని అన్నారు. అత్యాధునిక ఎన్ఐసీయూ, పీఐసీయూ యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. సంతానోత్పత్తి సేవల కోసం 3ఎం ఫెర్టిలిటీ సేవలను ప్రవేశ పెట్టామన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ, ఆస్పత్రి డైరెక్టర్ చల్లగుళ రాకేశ్, సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేషన్ ఛైర్మన్లు మువ్వా విజయ్‌బాబు, రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, డీఎంహెచ్ఓ సుబ్బారావు, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ పాల్గొన్నారు.

సుహాస్ 'సిల్వర్ ప్యారడైజ్' ప్రారంభం

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రముఖ ఆభరణాల సంస్థ సుహాస్ జ్యూయలరీస్ స్థాపించి ఐదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఖమ్మం వైరా రోడ్డులో ప్రత్యేకంగా 'సిల్వర్ ప్యారడైజ్' షోరూంను ప్రారంభించారు. సుహాస్ జ్యూయలరీస్ నిర్వాహకులు దుగ్గి సుహాస్, సంతోషి దంపతులు, సాహితి.. జ్యోతి వెలిగించి షోరూంను ప్రారంభించారు. సంస్థ అధినేత దుగ్గి సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. తమ సంస్థ 5వ వార్షికోత్సవం సందర్భంగా వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఏ వస్తువుపైనైనా 5.9 నుంచి 11.9 శాతం తరుగు తీసుకుంటామని, ఈనెల 29వ తేదీ వరకు రాయితీ కొనసాగుతుందని చెప్పారు. ప్రతి కొనుగోలుదారుకు లక్కీ డ్రా కూపన్ అందిస్తామని, డ్రాలో మొదటి బహుమతి 50 గ్రాముల బంగారం, రెండో బహుమతి 20, మూడో బహుమతి 10 బంగారం... అలాగే నాలుగో బహుమతి 100 గ్రాముల వెండి, ఐదో బహుమతిగా 50 గ్రాముల వెండి ఇస్తామని తెలిపారు. ప్రతి రూ.లక్ష కొనుగోలుపై రూ.500 వెండి కూపన్ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో షోరూం ఉద్యోగులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి షోరూంను ప్రారంభిస్తున్న సుహాస్ జ్యూయలరీస్ నిర్వాహకులు

ఆటోని ఢీకొన్న ఆర్టీసీ బస్సు: ఇద్దరు యువకుల దుర్మరణం



ఘటనా స్థలంలో యువకుల మృతదేహాలు

జూలూరుపాడు, న్యూస్‌టుడే: ఆటోని ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు భవాని భక్తులు దుర్మరణం చెందిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం వద్ద బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ మండలం జగన్నాథపురం బసవతారక కాలనీకి చెందిన గుగులోత్ మనోహర్(20), బానోత్ సంతోష్(24) ఆటోలో జూలూరుపాడు వైపు వస్తున్నారు. వీరిలో ఒకరు ఆటో నడుపుతుండగా, మరొకరు వెనుక కూర్చున్నారు. ఈ క్రమంలోనే ఎదురుగా వచ్చిన మణుగూరు ఆర్టీసీ డిపో బస్సు ఢీకొంది. దీంతో ఆటో నుజ్జుకాగా, దానిలోని ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. వీరిలో సంతోష్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తుండగా, మనోహర్ ప్రైవేటు ల్యాబ్‌టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఇటీవలనే ఈ ఇద్దరు యువకులు భవానీ మాల ధరించారు. సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రాణాప్రతాప్, హెడ్‌కానిస్టేబుల్ దయానంద్‌లు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుల కుటుంబ సభ్యులు ప్రమాద స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బతుకమ్మపూల కోసం వెళ్లి..

చెరువులో మునిగి ఒకరు మృతి



నున్నా ఐలయ్య

అశ్వాపురం, న్యూస్‌టుడే: పండుగ పూట విషాదం చోటు చేసుకుంది. అశ్వాపురం మండలం జగ్గారం గ్రామంలో నున్నా ఐలయ్య(38) బుధవారం ఉదయాన్నే బతుకమ్మ పూల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందారు. ఐలయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మణుగూరులోని సురక్ష బస్టాండ్‌లో హమాలీగా పనిచేస్తున్నారు. ఐలయ్యకు ఈత రాదు. పూల కోసం దిగిన చోట పెద్ద గుంత ఉండగా ఒక్కసారిగా నీటి మునిగారు. ఇది చూసి చుట్టు పక్కల ఉన్నవారు పెద్దగా కేకలు వేశారు. కొందరు నీళ్లల్లో దూకి కాపాడే ప్రయత్నం చేయగా.. అప్పటికే ఐలయ్య మృతిచెందారు.

ఉద్యోగ విషయంపై మనస్తాపంతో యువతి బలవన్మరణం

మాదాపూర్, న్యూస్‌టుడే: ఉరేసుకొని యువతి బలవన్మరణానికి పాల్పడిన ఘటన హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. మాదాపూర్ ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. మణుగూరుకు చెందిన మహ్మద్ ముస్కాన్(23) హైటెక్ సిటీలోని ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. పనిఒత్తిడి కారణంగా ఉద్యోగం మానేసి రెండు నెలలుగా ఖాళీగా ఉంటున్నారు. మరో ఉద్యోగం కోసం అన్వేషిస్తున్న ఆమె రెండు రోజుల క్రితం మాదాపూర్ క్యాపిటల్ రోడ్డులోని హాస్టల్‌లో తన సోదరి హసీనా వద్దకు చేరుకున్నారు. మంగళవారం సాయంత్రం హసీనాతోపాటు మిగతా రూమ్మేట్స్ ఉద్యోగాలకు వెళ్లారు. ఆ సమయంలో ముస్కాన్ ఒంటరిగా ఉన్నారు. విధులు ముగించుకొని హసీనా బుధవారం తెల్లవారుజామున హాస్టల్‌కు వచ్చి చూడగా గది తలుపులు పెట్టి ఉన్నాయి. ముస్కాన్‌కు ఫోన్ చేసినా ఎత్తలేదు. అనుమానం వచ్చిన హాస్టల్ సిబ్బంది పోలీసులకు సమాచారమందించారు. వారొచ్చి గది తలుపులు పగలగొట్టి చూడగా ముస్కాన్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రేమించి.. పెళ్లికి నిరాకరించిన యువకుడి అరెస్టు

సైదాబాద్, న్యూస్‌టుడే: ప్రేమ పేరిట యువతిని గర్భవతిని చేసి, పెళ్లికి నిరాకరించిన యువకుడిని సైదాబాద్ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై నాగిశెట్టి సాయికృష్ణ వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్‌కు చెందిన యువతి (21) దిల్‌సుఖ్‌నగర్‌లో కానిస్టేబుల్ ఉద్యోగానికి శిక్షణ పొందేందుకు 2022లో చేరారు. ఆ సమయంలో ఖమ్మం జిల్లాకు చెందిన మహేందర్ (24) పరిచయమయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లొంగదీసుకున్నాడు. 2023లో గర్భం దాల్చడంతో, కొంతకాలం ఆగిన తర్వాత పెళ్లి చేసుకుంటానని నమ్మించి అబార్షన్ చేయించాడు. అనంతరం పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలు గతనెలలో పోలీసులను ఆశ్రయించారు. యువకుడిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని రిమాండ్ చేశారు.

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	6,000	6,900	6,700
పాతపత్తి	7,000	7,400	7,300
పెసలు	6,600	7,300	6,775
కందులు	5,200	9,200	9,000
ఏసీ ఎండుమిరప	10,000	19,700	16,400
ఎండుమిరప	9,500	18,600	17,200

భద్రాద్రి ఇన్‌ఛార్జి డీహెచ్ఎస్ఓగా కిశోర్



ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల ఇన్‌ఛార్జి అధికారిగా జె.కిశోర్‌ను నియమించారు. ఈమేరకు రాష్ట్ర అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ జిల్లా అధికారిగా పని చేసిన సూర్యనారాయణ ఏసీబీకి చిక్కి సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మూడు రోజుల కిందట కరీంనగర్ జిల్లా అధికారిగా పని చేస్తున్న ఆర్.శ్రీనివాసరావును భద్రాద్రి జిల్లాకు బదిలీ చేశారు. ఆయన మెడికల్ లీవ్ పెట్టడంతో ప్రస్తుతం కిశోర్‌కు జిల్లా ఇంఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన ప్రస్తుతం అశ్వారావుపేట కొబ్బరి విత్తనోత్పత్తి కేంద్రం, అచుత్యాపురంలోని ఉద్యాన నర్సరీలో ఉద్యాన అధికారిగా పని చేస్తున్నారు. కొత్తగా మరో అధికారిని ఇక్కడకు బదిలీ చేసే వరకు ఇంఛార్జి బాధ్యతల్లో విధులు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ఉన్న పలువురు అధికారులు భద్రాద్రి జిల్లాకు రావాలంటే భయపడిపోతున్నారు. చాలామంది ఇక్కడకు వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. దీంతో ప్రభుత్వం ఇన్‌ఛార్జి అధికారిని నియమించింది.

పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాంతారావు



పాల్వంచ, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అరికొట్ల కాంతారావు బుధవారం నియమితులయ్యారు. ఆయన నియామకంపై సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లాల అధ్యక్షులు ఎలమద్ది వెంకటేశ్వర్లు, డీవీ వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. కాంతారావు ప్రస్తుతం ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం జానకీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఉపాధ్యక్షుడ్ని ఎన్నుకున్నారు.

ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం

☆ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఐదున్నర సంవత్సరాల పదవీ కాలంలో శాసన మండలిలో ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసినట్లు ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. త్వరలో జరిగే ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి తిరిగి పోటీ చేసేందుకు యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించిన అనంతరం తొలిసారిగా ఖమ్మం విచ్చేశారు. ఖమ్మంలోని జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విద్యారంగం, ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం శాసన మండలిలోనూ, బయట పోరాటాల సందర్భంగా శక్తి మేరకు కృషి చేశానని అన్నారు. మరోసారి తనను గెలిపించాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి మాట్లాడుతూ... నర్సిరెడ్డి లాంటి వారు చట్టసభల్లో ఉండాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య, రాష్ట్ర నాయకురాలు చావా దుర్గాభవాని, రాములు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, వెంకన్న, రాంబాబు, రంజాన్ తదితరులు పాల్గొన్నారు. వివిధ ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలకు చెందిన పలువురు జిల్లా, రాష్ట్ర బాధ్యులు పాల్గొని నర్సిరెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.




ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని అభినందిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావా రవి తదితరులు

మనసు బాగుంటే ఆనందం మీ వెంటే!

☆ నేడు 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినం'

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే

శారీరక ఆరోగ్యంతోపాటు మనసుకూ ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉరుకులూ పరుగుల జీవితంలో సరైన ఆహారం, నిద్ర కరవవుతున్నాయి. మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. దీంతో మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన అవసరంపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ ఏడాది 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం' 'పని ప్రదేశాల్లో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం' పేరిట దినోత్సవం జరపాలని డబ్ల్యూహెచ్‌ఓ నిర్ణయించింది.



పెరుగుతున్న బాధితులు

జిల్లాలో మానసిక సమస్యల బాధితులు పెరుగుతున్నారు. అన్ని వయసులవారు ఈ ప్రభావానికి లోనవుతున్నారు. ఉద్యోగ జీవితం, సహచరుల ప్రవర్తన, ఇతర కారణాలతో అనేక మంది మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. పని ప్రదేశాల్లో మహిళలు ఎక్కువగా సమస్య ఎదుర్కొంటున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇటీవల పురుషులూ ఆస్పత్రులకు వస్తున్నారు. కార్పొరేట్ సంస్థల్లో పని చేస్తున్న వారిపై ఈ ప్రభావం అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది.

మెరుగైన వైద్య సేవలు

ప్రభుత్వం ప్రత్యేకంగా 14416 హెల్ప్ లైన్ ద్వారా బాధితులకు సేవలందిస్తోంది. ఎవరైనా ఫోన్ చేసి సహాయం పొందవచ్చు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 653 మంది సేవలు పొందారు. మానసిక వ్యాధిగ్రస్థులను గుర్తించే క్రమంలో ఆరోగ్యశాఖ ప్రత్యేక సర్వే నిర్వహించింది. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో వైద్య సేవలందిస్తూ మెరుగైన వైద్యం కోసం ఖమ్మం సర్వజనాసుపత్రి మెంటల్ హెల్త్ క్లినిక్‌కు రిఫర్ చేస్తోంది. ఇప్పటివరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో 313 మంది చికిత్సలు పొందినట్లు ఆరోగ్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి.

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట


గుర్రాయిగూడెంలో పంటపొలాల్లో దొరికిన నెమలిని బీట్ అధికారి జాన్‌ప్రదీప్‌కు అప్పగిస్తున్న గ్రామస్థులు

అటవీ అధికారులకు నెమలి అప్పగింత

చంద్రుగొండ, న్యూస్‌టుడే: చంద్రుగొండ మండలం గుర్రాయిగూడెం గ్రామ శివారులోని పంటపొలాల్లో అస్వస్థతకు గురైన నెమలి మంగళవారం రాత్రి గ్రామస్థులకు దొరికింది. పురుగుమందు పిచికారీ చేసిన పొలంలోని పురుగులను తిని ఇది అస్వస్థతకు గురైంది. దీనికి రైతులు వైద్యసేవలు చేసి అటవీశాఖ బీట్ అధికారి జాన్ ప్రదీప్‌కు బుధవారం అందజేశారు. నెమలిని తిరిగి అటవీప్రాంతంలో వదిలేసినట్లు అటవీశాఖ రేంజర్ ఎల్లయ్య తెలిపారు.

బతుకమ్మ సుఖసంతోషాలివ్వాలి: పీఓ

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాల్లో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు, మహిళలకు భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు బుధవారం తెలిపారు. ఆటపాటలతో బతుకమ్మ పండగ ప్రజలందరికీ సుఖ సంతోషాలు ఇవ్వాలన్నారు. ఐటీడీఏ పరిధిలో వివిధ శాఖలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికీ శుభాకాంక్షలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

సమస్య: భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద వీధి లైటు వెలగడం లేదు. వీధి లైటు వెలిగేలా చర్యలు తీసుకోవాలి. **రాములు, భద్రాచలం**

సమాధానం: వీధి లైటు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. - **సీహెచ్ శ్రీనివాసరావు, భద్రాచలం పంచాయతీ ఈఓ**

– భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే

వీధి దీపాల ఏర్పాటు

స్పందనకు వందనం

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: నర్సాపురం పంచాయతీలో వీధి దీపాలు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్న అంశంపై 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ఈనెల 3న ప్రచురితమవడంతో పంచాయతీ కార్యదర్శి యాకూబ్ స్పందించారు. వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

12న ఆయిల్‌పాం కిసాన్ మేళా: ఎమ్మెల్యే జారే


అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే, తదితరులు

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమలో రూ.32కోట్లతో నిర్మించిన టర్బైన్‌ను వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈనెల 12న ప్రారంభించనున్నారని, అదే రోజు ఆయిల్‌పాం కిసాన్ మేళా, రైతు సదస్సు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు. అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమలో నూతనంగా నిర్మించిన టర్బైన్‌ను అధికారులతో కలిసి బుధవారం సందర్శించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్దఎత్తున ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి దిక్సూచిగా మారుస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆయిల్‌పాంకు కనీస మద్దతు ధర రూ.20వేలకు తగ్గకుండా ఇచ్చేందుకు కేంద్రంపై వత్తిడి పెంచేందుకు ఇరు తెలుగు రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు, అధికారులు, రైతుసంఘ నాయకులు, ప్రజాప్రతినిధులతో త్వరలోనే దిల్లీకి వెళ్లే కార్యాచరణకు కిసాన్‌మేళా వేదిక కానుందన్నారు. రైతు సదస్సులో నూతన యంత్ర పరికరాలు, గెలలు కోసే పరికరాలు, పురుగుమందుల పిచికారి యూనిట్లు, చాప్‌కట్టర్లు తదితరాలను ప్రదర్శించనున్నారని తెలిపారు. ఆయిల్‌ఫెడ్ అడ్వైజరీకమిటీ సభ్యుడు ఆలపాటి రామచంద్రప్రసాదు, బండి భాస్కర్, చిన్నంశెట్టి సత్యనారాయణ, పరిశ్రమ అధికారులు బాలకృష్ణ, నాగబాబు, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. ములకలపల్లిలోనూ రైతుసంఘ సమావేశం నిర్వహించి ఆలపాటి రామచంద్రప్రసాదు ప్రసంగించారు.

ఖరీఫ్‌కు దోకా లేనట్లే..!

పుష్కలంగా నీటితో తాలిపేరు జలాశయం

చర్ల, న్యూస్‌టుడే

ఏజెన్సీ రైతుల పాలిట వరప్రదాయనిగా నిలిచే తాలిపేరు మధ్యతరహా జలాశయం కింద ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన వరి పంటకు సాగునీటి ఢోకా లేనట్లే. జలాశయంలో ఇప్పటికీ ఎగువ నుంచి ఇన్‌ఫ్లో దాదాపు 1140 క్యూసెక్కులు వస్తోంది. దీంతో ఆయకట్టులో సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు పేర్కొంటున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో అత్యంత క్యాచ్‌మెంట్ ఏరియా కలిగిన ప్రాజెక్టుగా 'తాలిపేరు'కు ప్రత్యేక గుర్తింపు ఉంది.


ఆయకట్టులో వరిసాగు


✦ చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో 24,700 ఎకరాల స్థిరీకరణ ఆయకట్టుకు సాగునీరు ఈ జలాశయం ద్వారా అందుతుంది. ప్రాజెక్టు పరిధిలోని చివరి భూములకు అధ్వానంగా మారిన కాల్వల దుస్థితితో కొద్దికాలం సాగునీటి ఇబ్బందులు తలెత్తేవి. ప్రస్తుతం కాల్వల పూడిక తీత పనులు కొంతమేరకు చేయడంతో ఆ పొలాలకూ నీరు చేరుతోంది. 0.73 టీఎంసీల సామర్థ్య నీటి నిల్వ ఉండే ఈ జలాశయం మొత్తంగా 2.5 టీఎంసీల నీటి వినియోగం ద్వారా ఏటా సస్యసిరులు కురిపిస్తోంది.

పొదుపుగా వాడుకుంటే అందరికీ మేలు: తిరుపతి, ప్రాజెక్టు డీఈ



ప్రస్తుతం వర్షాకాలం పంటకు ఎలాంటి ఢోకా లేదు. ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లున్నాయి. చివరి భూముల వరకు ఖరీఫ్ వరిపంట చివరి వరకు నీళ్లందిస్తాం. ఇందులో ఎలాంటి సందేహం లేదు. రైతులు ఆందోళన చెందాల్సింది లేదు. కాకుంటే సాగునీటిని ఎట్టి పరిస్థితుల్లో వృథా చేయొద్దు. పొదుపుగా నీటిని వాడుకుంటే రైతులందరికీ మేలు చేకూరుతుంది.

కాల్వలను ఆధునికీకరించాలి: పెనుమత్స సీతాపతి రాజు(గొగుబాక)



ప్రాజెక్టు అధికారుల చొరవతో సాగునీటి ఇబ్బందులు తొలుగుతున్నాయి. ఇటీవల కాల్వకు పడిన గండ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చడం ద్వారా సకాలంలో సాగునీటిని సరఫరా చేశారు. చాలా సంతోషం. తాలిపేరు మాకు కన్నతల్లి లాంటి వరం. ప్రభుత్వం ప్రాజెక్టుపై నిర్లక్ష్యాన్ని వీడి కాల్వల ఆధునికీకరణకు నిధులు కేటాయించాలి. పూర్తిస్థాయిలో పూడికతీస్తే ఆయకట్టు రైతులకు మరింత సౌలభ్యంగా ఉంటుంది.

వట్టంవారి పంచాయతీని సందర్శించిన డీఎల్‌పీఓ

కరకగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని వట్టంవారి పంచాయతీని డీఎల్‌పీఓ సుధీర్ కుమార్ బుధవారం సందర్శించారు. బుధవారం స్థానిక డంపింగ్ షెడ్, శ్మశాన వాటిక, నర్సరీ మొక్కలను, ఎవెన్యూ ప్లాంటేషన్, మురుగు కాలువలను పరిశీలించారు. గ్రామాలలో శానిటేషన్ చేస్తున్నారా? లేదా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆ పంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీఓ కుమార్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


వట్టంవారి గుంపులోని నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ సుధీర్‌కుమార్

'గొత్తికోయలకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి'

చర్ల, న్యూస్‌టుడే: గొత్తికోయలకు అర్ధాంతరంగా నిలిపివేసిన ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలను తక్షణమే జారీ చేయాలని తెజస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకరరావు డిమాండ్ చేశారు. చర్లలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగపరంగా సంక్రమించిన ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాల జారీని నిలిపివేసిన అధికారులను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చర్లలో సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. పూనెం ప్రదీప్, మడకం చందు, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు కాటమయ్య రక్షణ పరికరాలు పంపిణీ

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేట పట్టణంలో గీత కార్మికులకు ఆబ్కారీ ఆధ్వర్యంలో కాటమయ్య పరికరాలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం పంపిణీ చేశారు. గీత కార్మికులకు రక్షణగా ఉపయోగపడే ఈ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆబ్కారీ అధికారులు, కాంగ్రెస్ ప్రముఖులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరకులు అందించాలి

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరకులు అందించాలని భద్రాద్రి డివిజన్ ప్రజా పరిరక్షణ సమితి గౌరవాధ్యక్షుడు మారెడ్డి శివాజీ అన్నారు. స్థానిక పాత మార్కెట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాణ్యమైన సన్న బియ్యం అందించాలని, వీటితోపాటు కందిపప్పు ఇతర నిత్యావసరాలు అందించాలని డిమాండ్ చేశారు.

బోర్ పాయింట్ ఏర్పాటు

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: గుమ్మడవల్లి, ఆసుపాకలో తాగునీటి సమస్యను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో నూతనంగా బోర్లు వేసేందుకు బుధవారం జియాలజిస్టు యదగిరి రెడ్డి పరీక్షలు నిర్వహించి మార్కింగ్ ఇచ్చారు. బోరువేసి విద్యుత్తు మోటారు ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తన కోటా నిధులను కేటాయిస్తున్నారని, ఇందుకోసం అంచనాలు తయారు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సలీం తెలిపారు.

ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలి: పీవైఎల్

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: నిరుద్యోగ గిరిజనుల కోసం ఐటీడీఏ ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) జిల్లా కార్యదర్శి పర్శిక రవి అన్నారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో బుధవారం ఆ సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి రాష్ట్రంలో గిరిజనుల కోసం డీఎస్సీ నిర్వహించడం జరిగిందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత డీఎస్సీ నిర్వహించకపోవడంతో గిరిజనులు విద్యకు దూరం అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చింత నరసింహారావు, మోతిలాల్, సతీశ్, తారచంద్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు ఇవ్వాలి

గుండాల: పంట రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ వెంటనే రుణాలు ఇవ్వాలని ఎన్డీ నాయకులు గడ్డం లాలయ్య అన్నారు. బుధవారం గుండాలలో ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. గుండాల బ్యాంకులో 400 మందికిపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కృష్ణ, నర్సింహారావు, శ్రీను పాల్గొన్నారు.

'బ్యాంకుల్లో దళారులను ప్రోత్సహిస్తున్నారు'

ములకలపల్లి, న్యూస్‌టుడే: ములకలపల్లి, పూసుగూడెంలలోని ఓ జాతీయ బ్యాంకు శాఖల్లో రైతులకు వ్యవసాయ రుణాలు ఇచ్చేందుకు దళారులను ఆశ్రయిస్తే సకాలంలో రుణాలు ఇస్తున్నారని, లేకుంటే తీవ్రజాప్యం చేస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి రాంబాబు ఆరోపించారు. రూ. 30 వేల ఇన్సూరెన్స్‌ను మూడేళ్లపాటు చెల్లించాలని రైతులను ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్రీడా పోటీల్లో రేంజర్ ఎల్లయ్యకు పతకాలు


అటవీశాఖ సీసీసీఎఫ్ నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న రేంజర్ ఎల్లయ్య

చంద్రుగొండ, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో జరిగిన అటవీ శాఖ రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో చంద్రుగొండ అటవీశాఖ రేంజర్ సీహెచ్ ఎల్లయ్య ప్రతిభ చూపారు. 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ, 25 కి.మీ. నడక పోటీలో తృతీయ స్థానం సాధించారు. ఆయనకు అటవీ శాఖ సీసీసీఎఫ్ డోబ్రియల్ పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

'సింగరేణి విందులను వ్యతిరేకిస్తున్నాం'

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: సింగరేణి నిధులతో కార్మికులకు యాజమాన్యం ఇవ్వాలని అనుకుంటున్న విందులను వ్యతిరేకిస్తున్నట్లు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) బ్రాంచి కార్యదర్శి వెంకటరత్నం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సింగరేణి సొమ్ముతో స్థానిక నాయకుల ద్వారా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని చూస్తుందన్నారు. సింగరేణికి రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించి కార్మికులకు విందు ఏర్పాటు చేయాలన్నారు.

బస్సులో తరలిస్తున్న గంజాయి పట్టివేత

భద్రాచలం పట్టణం: ఆర్టీసీ బస్సులో అక్రమంగా 14.2 కిలోల ఎండు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు బుధవారం భద్రాచలం బస్టాండులో పట్టుకున్నారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా డొంకరాయికి చెందిన రాంబాబు, లోవాలు ఒడిశా నుంచి విజయవాడకు గంజాయి తరలిస్తునట్లు భద్రాచలం ఎస్సై విజయలక్ష్మి తెలిపారు. ఇద్దరికి చెందిన రెండు సంచుల్లో తనిఖీ చేయగా సుమారు రూ.2.15 లక్షల విలువైన గంజాయి లభ్యమైందని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

దమ్మక్క కాలనీ గిరిజనులపై దాడులు ఆపాలి: మాస్‌లైన్

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణ శివారు(ఏపీ)లోని దమ్మక్క కాలనీ గిరిజనులపై దాడులు ఆపాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ నాయకుడు మునిగెల శివప్రశాంత్ అన్నారు. పట్టణ శివారులో బుధవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలం రామాలయం భూముల్లో ఉన్నారనే సాకు చూపి వారిపై ఆలయ ఈఓ సమస్య సృష్టిస్తున్నారని ఆరోపించారు. దమ్మక్క వారసులైన ఆమాయక ఆదివాసీలపై కేసులు పెడితే చూస్తూ ఊరుకోమని అన్నారు.

వర్షాలకు గుంతల్లో నీరు చేరి..



చంద్రుగొండ మండలం పోకలగూడెం రహదారిపై గుంతల్లో నీరుచేరి వర్షాలకు చిత్తడిగా మారింది. ర.భ.శాఖ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డు పలుచోట్ల దెబ్బతినటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రెండు రోజుల కిందట కురిసిన వర్షానికి రోడ్డంతా ఇలా తయారైందని, మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ఎంపీడీవో అశోక్ మాట్లాడుతూ ఆ రహదారిని పరిశీలించి బాగు చేయిస్తామన్నారు.

– చంద్రుగొండ, న్యూస్‌టుడే

జిల్లా న్యాయమూర్తిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు


జిల్లా న్యాయమూర్తి వసంత్‌పటేల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయవాదులు

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: మణుగూరు బార్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన సందర్భంగా జిల్లా న్యాయమూర్తి వసంత్ పటేల్‌ని బార్ అసోసియేషన్ సభ్యులు బుధవారం కలిశారు. న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మణుగూరు కోర్టులోని సమస్యలను న్యాయమూర్తికి వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేదరమెట్ల శ్రీనివాసు, రామ్మోహన్, కవిత, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


మామిళ్లవారిగూడెంలో సరస్వతిదేవి అలంకరణలోని అమ్మవారి వద్ద బాలలు


అశ్వారావుపేట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహిళల పూజలు


కరకగూడెంలో..


భద్రాచలంలో..

అమ్మ ఉత్సవం.. అందరికీ ఆనందం

అశ్వారావుపేట, అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అశ్వారావుపేటలోని పలు ఆలయాల్లో పెద్దఎత్తున సరస్వతీ పూజలు నిర్వహించారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, పాత రామాలయం, కనకదుర్గా అమ్మవారి ఆలయం, మామిళ్లవారిగూడెం, నారంవారిగూడెం, నారాయణపురం తదితర గ్రామాల్లో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు.


దుమ్ముగూడెంలో..


పినపాకలో..

అన్నపురెడ్డిపల్లి: స్థానిక శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలోని అమ్మవారు శ్రీసరస్వతీదేవి రూపంలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, కుంకుమార్చనలు నిర్వహించారు.

దమ్మపేట: స్థానిక శ్రీగాయత్రీ ఆశ్రమం, విశ్వేశ్వరాలయం, నాచారం శ్రీజయలింగేశ్వరస్వామి ఆలయం, వడ్లగూడెం దుర్గామల్లేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారి పూజలు సాగాయి. చిన్నారులకు అక్షరాభ్యాసాలు సాగాయి.

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల, లక్ష్మీనగరం, నడికుడి, సీతారాంపురం ఆలయాల్లో అమ్మవారిని సరస్వతీదేవిగా బుధవారం అలంకరించారు.

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం శాంతినగర్‌లోని శ్రీలలితా పరమేశ్వరి అమ్మవారు బుధవారం సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

మణుగూరు సాంస్కృతికం, కరకగూడెం, పినపాక, న్యూస్‌టుడే: మణుగూరులోని పలు అమ్మవారి ఆలయాల్లో బుధవారం అమ్మవారు సరస్వతిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సివిల్ ఆఫీస్ కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని లిల్లీ పూలతో సుందరంగా అలంకరించి, సామూహిక కుంకుమపూజ నిర్వహించారు.

★ కరకగూడెం రామాలయం, భట్టుపల్లి సమీపంలోని రాళ్లవాగు పెద్దమ్మతల్లి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారు. బుధవారం దుర్గాదేవి సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. బాలలచే అక్షరాభ్యాసం చేయించారు. మహిళలు పూజలు నిర్వహించారు.

★ పినపాక మండలం పోతురెడ్డిపల్లిలో అమ్మవారు సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు విద్యార్థులు తమ పుస్తకాలను అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

చంద్రుగొండ, న్యూస్‌టుడే: చంద్రుగొండలోని పలు చోట్ల జరిగిన బతుకమ్మ సంబురాల్లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం రాత్రి పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. సంబురాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేను మహిళలు దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మహా పాదయాత్రతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స


'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స' సర్టిఫికేట్‌ను చూపుతున్న వీరేంద్రచౌదరి

తిరుపతి (భవానీనగర్) న్యూస్‌టుడే: రామన్న-వెంకన్న మహాపాదయాత్ర పేరుతో ఇప్పటివరకు ఏడుసార్లు భద్రాచలం నుంచి తిరుమల శ్రీవారి సన్నిధికి కాలినడక వచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నట్లు డా.గొల్లపూడి వీరేంద్రచౌదరి తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాట్లాడారు. సెప్టెంబర్ 19న 11 మందితో మహా పాదయాత్రను ప్రారంభించి, ఈనెల అక్టోబరు 7న తిరుమలకు చేరుకున్నట్లు ఆయన చెప్పారు. 619 కి.మీ దూరాన్ని 19 రోజుల్లో చేరుకోవడంతో 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో తన పేరు నమోదు అయ్యిందన్నారు. శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.10 లక్షల విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి పుష్కర్ కుమ్ర వీరేంద్రచౌదరికి ధ్రువపత్రం అందజేసి సత్కరించారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ


ఉపకరణాలు తీసుకునేందుకు వచ్చిన దివ్యాంగులు

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: దివ్యాంగులకు ఉపకరణాలను ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు విజయలక్ష్మి బుధవారం అందజేశారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉపకరణాలను స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం అందజేశారు. 82మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లు, చక్రాల కుర్చీలు, వినికిడి యంత్రాలు, చేతికర్రలు, కృత్రిమ అవయవాలు, చంకకర్రలు అందజేశారు. అలింకో సంస్థ సిబ్బంది రష్మీ, రంజాన్ శెట్టి, అభిషేక్ ద్వివేది, ఐసీడీఎస్ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

హామీల అమలుకు పోరాటాలు


జెండావిష్కరణలో పాల్గొన్న సీపీఎం శ్రేణులు

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీల అమలుకు ప్రజా పోరాటాలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. లక్ష్మీనగరం, అచ్యుతాపురం శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలైనా సంక్షేమ పథకాలను, ఆరు హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వంశీకృష్ణ, పుల్లయ్య, రాజమ్మ, రాంమోహన్‌రెడ్డి, ధర్మయ్య, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అశ్వారావుపేట మండలం వినాయకపురం 33/11కేవీ విద్యుత్తు ఉపకేంద్రంలో గురువారం మరమ్మతులు నిర్వహిస్తున్నందున వినాయకపురం, నారాయణపురం, గంగారం విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ సురేష్ తెలిపారు.

స్తంభాలు తొలగించకుండానే.. రోడ్డేస్తారా..?

అశ్వారావుపేట, న్యూస్‌టుడే

రహదారులు భవనాల శాఖ, విద్యుత్తు సంస్థ అధికారుల మధ్య సమన్వయలోపం అభివృద్ధి పనులకు, అశ్వారావుపేట పట్టణ ప్రజలకు శాపంగా మారనుంది. రూ. 32 కోట్లతో ఖమ్మం- రాజమండ్రి మార్గం, అశ్వారావుపేట- బూర్గంపాడు మార్గంలో గత ఏడాది జూన్ 2న రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్, మురుగునీటి కాలువలు, డివైడర్ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. అప్పట్లో అశ్వారావుపేట- బూర్గంపాడు రోడ్డును విస్తరణ కోసం తవ్వారు. అనంతరం తాగునీటి పైపులైను, విద్యుత్తు స్తంభాలు అడ్డుగా ఉన్నాయంటూ పనులు నిలిపివేశారు.


రోడ్డు మధ్యలోని విద్యుత్తు స్తంభం తొలగించకుండానే చేపట్టిన విస్తరణ పనులు

★ ఎట్టకేలకు 16 నెలలు నిలిచిన పనులు ఇటీవలే పునఃప్రారంభించారు. బూర్గంపాడు మార్గంలోని దొంతికుంట చెరువువైపు సమీపంలో రోడ్డు కొంతమేర తవ్వి మట్టి తీశారు. అందులో వైట్ మిక్చర్ పోసి చదును చేస్తున్నారు. ఇంతవరకూ బాగానే ఉన్నా... రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించకుండానే పనులు చేస్తున్నారు. ఇలా చేస్తే మరోసారి విద్యుత్తు స్తంభాలు తీసేటప్పుడు రోడ్డును మళ్లీ తవ్వాల్సి వస్తుందని ఇలా చేస్తే ఉపయోగం ఏంటని పలువురి నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

★ మురుగునీటి కాలువ నిర్మాణం చేయాలంటే తప్పనిసరిగా మంచినీటి పైపులైను, విద్యుత్తు లైను తొలగించాలి. వాటిని తొలగించకుండానే పనులు చేయడం పట్టణ ప్రజలకు ఇబ్బందికరంగానే మారనుంది.

★ గతనెల 21న ర.భ.శాఖలోని విద్యుత్తు విభాగం అధికారులు బూర్గంపాడు మార్గం, ఖమ్మం- రాజమండ్రి జాతీయ రహదారిలో విద్యుత్తు స్తంభాల ఏర్పాటు, తీగ ఎంత పడుతుంది, ఇతర పనులకు ఎంత ఖర్చవుతుంది. పనులు ఎప్పటిలోగా పూర్తిచేసే అవకాశం ఉందో అంచనా వేశారు. ఈ నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పనులను పటిష్ఠంగా నిర్వహిస్తేనే ప్రజలకు మేలు జరుగుతుంది.

★ దీనిపై ర.భ.శాఖ డీఈఈ శ్రీనివాస్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ రోడ్డు విస్తరణ గుత్తేదారు ఒకరు.. విద్యుత్తు లైను తొలగించేది వేరొకరని.. అందువల్లే ఆ గుత్తేదారు వచ్చేవరకూ పనులు ఆపకూడదని పనులు చేస్తున్నామన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో నిందితులకు రిమాండు

ములకలపల్లి, న్యూస్‌టుడే: భర్త, అతడి కుటుంబసభ్యుల వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో భర్తతోపాటు అతడి కుటుంబ సభ్యులను అరెస్టుచేసి రిమాండుకు తరలించారు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ములకలపల్లి మండలం మూకమామిడి గ్రామానికి చెందిన రేణుక(23)కు టేకులపల్లి మండలం దంతాలతండకు చెందిన భూక్య బాబులాల్‌తో 2022లో వివాహమైంది. వీరికి సంతానం కలగకపోవడంతో బాబులాల్ కుటుంబసభ్యులు రేణుకను దూషించి పుట్టింటికి పంపారు. దీంతో సెప్టెంబరు 27న ఆమె కలుపుమందు తాగింది. చికిత్స పొందుతూ ఈనెల 2న మృతిచెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు రేణుక భర్త బాబులాల్, అత్త బుల్లి, మామ లాల్‌సింగ్‌తోపాటు మరో నలుగురిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

దాడి ఘటనపై కేసు

ములకలపల్లి, న్యూస్‌టుడే: అక్రమంగా విద్యుత్తు వినియోగిస్తున్న వ్యక్తిని అడ్డుకున్న రైతుపై దాడికి పాల్పడిన ఘటన పై ములకలపల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. ములకలపల్లి మండలం రింగిరెడ్డిపల్లికి చెందిన బైటా జోగులుతోపాటు మరో తొమ్మిది మంది రైతులకు ఒక విద్యుత్తు లైనుతోపాటు నియంత్రికను అందజేశారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన రాధాకృష్ణ అక్రమంగా విద్యుత్ నియంత్రిక నుంచి విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడు పడుతోందని జోగులు ప్రశ్నించడంతో రాధాకృష్ణ అతడిపై దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

అక్రమంగా నిల్వచేసిన కలప స్వాధీనం

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గౌరవరం గ్రామ సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన టేకు కలపను అటవీశాఖ అధికారులు బుధవారం పట్టుకున్నారు. కొందరు వ్యక్తులు అక్రమంగా కలపను నిల్వ చేశారు. సమాచారం తెలుసుకున్న ఫారెస్టు రేంజి అధికారి కమల తన సిబ్బందితో దాడి చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. కలప ఖరీదు సుమారు రూ.40వేలు ఉంటుందని అటవీ శాఖ అధికారులు అంచనా వేశారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతారం సమీపంలోని వాగు నుంచి దొంతికుంటకు చెందిన ఎం.అరవింద్ అక్రమంగా ఇసుక తరలిస్తుండటాన్ని పోలీసులు తనిఖీల్లో గుర్తించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యయాతిరాజు తెలిపారు.

కొత్తగూడెం
• కొత్తగూడెం • ఇల్లెందు

కార్మికులకు వేతనాలు చెల్లించండి

టేకులపల్లి, న్యూస్‌టుడే: పంచాయతీ కార్మికులకు దసరా పండగలోపు వేతనాలు చెల్లించాలని ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు డి.ప్రసాద్ డిమాండ్ చేశారు. కుంటల్ల పంచాయతీలో కార్మికులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పెద్ద పండగ అయిన దసరాకు కూడా కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు పోశం రాజు, ఈశ్వర్, కౌసల్య, రాధ, ఎర్రయ్య, తావుర్యా, లింగ, కమల పాల్గొన్నారు.

'ఆజాద్ అధికార్ సేన' అధ్యక్షుడిగా కోరి

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ఆజాద్ అధికార్ సేన ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా శ్యామ్‌సుందర్ కోరి నియమితులయ్యారు. సేన జాతీయాధ్యక్షుడు అమితాబ్ ఠాకూర్ ఆదేశాలతో ప్రధాన కార్యదర్శి నూతన్ ఠాకూర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇల్లెందు మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు

ఇల్లెందు (గ్రామీణం), న్యూస్‌టుడే: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు(ఇల్లెందు), వైస్ చైర్మన్‌గా బిజ్జ వెంకటేశ్వర్లు (బయ్యారం), మరో 12మందిని సభ్యులుగా నియమిస్తూ వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ సంచాలకులు ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. వీరి పదవీకాలం రెండేళ్ల పాటు ఉంటుందని ఉత్తర్వుల్లో ప్రస్తావించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) కొత్తగూడెం: 8008573723 పాల్వంచ: 9550076766 ఇల్లెందు: 9154846689

స్పందనకు సలాం

పాల్వంచ శ్రీనివాస కాలనీలో డ్రైనేజీ పూడిక సమస్యను స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం... మీకు తోడుగా..' ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఏఈ పవన్ పనులు చేయించారు. కాలువను గురువారం శుభ్రం చేయించారు. – పాల్వంచ, న్యూస్‌టుడే

సింగరేణి కార్యాలయంలో జీఎం సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందుగ్రామీణం (కారేపల్లి), న్యూస్‌టుడే: ఇల్లెందు సింగరేణి సంస్థ కార్యాలయంలో వివిధ విభాగాల బాధ్యులు, అధికారులతో జీఎం జాన్‌ఆనంద్ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఉద్యోగులందరికీ సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, మిషనరీ పనితీరు, ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి కార్యాచరణతో పాటు పలు అంశాలపై చర్చించారు. ఇల్లెందు జేకే5ఓసీ, జీఎం కార్యాలయ సిబ్బందికి 10న వైసీఓఏ క్లబ్, 11న కోయగూడెం క్లబ్‌లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఓటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, అధికారుల సంఘం అధ్యక్షుడు శివప్రసాద్, ఏజీఎం గిరిధర్‌రావు, ప్రాజెక్టు అధికారి కృష్ణమోహన్ పాల్గొన్నారు. ● సింగరేణి పాఠశాల మైదానం, జేకే కాలనీలో ఈ నెల 10న సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీడే వేడుకలు నిర్వహిస్తున్నట్లు సంస్థ జీఎం జాన్‌ఆనంద్ తెలిపారు.

మహిళలు స్వశక్తితో ఎదిగేలా తోడ్పాటు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళలు స్వయంశక్తితో ఎదిగేలా ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. ఇందిరా మహిళాశక్తి ఆధ్వర్యంలో ఇల్లెందులో స్వయం సహాయక గ్రూపు సభ్యులకు పలు బ్యాంకులకు చెందిన రూ.3కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. పాడిపశువుల కోసం 32 మంది లబ్ధిదారులకు రూ.11.90లక్షల చెక్కులు, 40 మంది లబ్ధిదారులకు రెండువేల కోడిపిల్లలను అందజేశారు. తహసీల్దార్ రవికుమార్, ఏఎస్ కంట్రిబ్యూటర్స్ నుంచి ఆరిపుద్దిన్, ఏపీఎం దుర్గారావు, యూనియన్ బ్యాంకు మేనేజర్ బాలకృష్ణ, నాగమణి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం

కాటమయ్య కిట్లతో రక్ష: గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కాటమయ్య కిట్లు అందిస్తోందని, రక్షణ కిట్లతోనే తాటిచెట్లు ఎక్కాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. ఇల్లెందు మార్కెట్‌యార్డులో గీత కార్మికులకు కాటమయ్య రక్షా కిట్లను బుధవారం పంపిణీ చేశారు. పుర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారిణి విజయలక్ష్మి, గౌడ సంఘం అధ్యక్షుడు బంధం నాగయ్య పాల్గొన్నారు.

అగాధం.. అడుగేస్తే ప్రాణాపాయం

వాగులు, చెరువుల వద్ద నిర్లక్ష్యంతో ప్రమాదం



ఉద్ధృతంగా ప్రవహిస్తున్న పెనుబల్లి వాగు

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే

ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులు నిండాయి. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఈత సరదాకు వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాల్సిన సమయమిది. దుస్తుల శుభ్రత, ఈత, చేపల వేట, కలప వేట అంటూ వాగుల వెంట పరుగులు పెడితే ప్రమాదాలను కొని తెచ్చుకోక తప్పదనే విషయాన్ని గమనించుకోవాలి. వరద ఉద్ధృతితో అంచులు కోతకు గురైన వాగుల్లో, తాటిదీసలాడే చెరువుల్లో లోతును అంచనా వేయడం అంత తేలికైన విషయం కాదు. ఊహించని అగాధం ఒక్కసారిగా ముంచేస్తుంది. మట్టి తవ్వకాలు, ఇసుక తవ్వకాలు జరిపిన చోట ఊబి ప్రాణాల్ని మింగేస్తుంది. బతుకమ్మ, దుర్గామాత విగ్రహ నిమజ్జనాల వేళ తస్మాత్ జాగ్రత్త అని పోలీసు, పంచాయతీల అధికారులు హెచ్చరిస్తున్నారు.

నియోజకవర్గంలోని పెనుబల్లి వాగు, ముర్రేడు వాగు, సుజాతనగర్ పెద్ద చెరువు, చాతకొండ గద్దలమడుగు వాగు, కిన్నెరసాని డొంకలు, రామవరం గోదుమవాగుల పరీవాహకాల ఇసుక అక్రమ తవ్వకాలతో అత్యంత ప్రమాదకరంగా మారాయి. సాధారణ సమయాల్లోనే వాగుల్లో ప్రవాహాన్ని అంచనా వేయలేం. ఎంతోమంది సరదాకని వాటిల్లోకి దిగి మృత్యువాత పడిన ఘటనలున్నాయి. ముర్రేడు వాగు అనిశెట్టిపల్లి నుంచి పాల్వంచ వరకు ప్రవహిస్తుంది. రామవరం గోదుమవాగు, పెనుబల్లి, గద్దల మడుగు వాగులన్నీ ముర్రేడులో కలుస్తాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఉప్పొంగిన వాగులు పైకి ప్రశాంతంగా కనిపిస్తున్నా.. పొంచివున్న ప్రమాదాన్ని పసిగట్టి జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. అధికారులు ఏర్పాటు చేసే ఘాట్ల వద్ద బతుకమ్మలు, దుర్గమ్మ విగ్రహాలను నిమజ్జనం చేయాలని పేర్కొన్నారు. ఆయా సమయాల్లో బాలలు, చిన్నారులను వెంట తీసుకెళ్లొద్దని హెచ్చరిస్తున్నారు. ఈత వచ్చిన వారు సైతం ప్రవాహ ఉద్ధృతి ఉంటే లోపలకు వెళ్లొద్దని చెబుతున్నారు.

మరణాలు ఇలా..

సంవత్సరం	మృతులు
2023	37
2024	11 (ఇప్పటి వరకు)

ప్రమాద ఘటనలకు ఆనవాళ్లు ఎన్నో..!:

☛ ముర్రేడువాగులో ఇసుకను తరలించడానికి వెళ్లిన యువకుడు ట్రాక్టర్‌తో సహా వాగులోని గుంతలో బోల్తా పడ్డాడు. ప్రవాహం అడుగున ఉన్న గుంతతో ప్రమాదం జరిగి.. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

☛ గతంలో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థులు గంగాబిషన్ బస్తీ నుంచి ప్రవహించే పెనుబల్లి వాగులో ఆడుకునేందుకు వెళ్లారు. లోతు తక్కువగానే ఉందన్న అవగాహన లోపంతో ముందుకు వెళ్లిన ఓ బాలుడు ఊబిలో కూరుకుపోయాడు. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికితీయడానికి రెండ్రోజులు పట్టింది.

☛ రామవరం గోదుమవాగులో సరదా కోసం ఈతకు వెళ్లిన బాలురు కాసేపు సంతోషంగా గడిపారు. వారిలో ఒకరు ఊబిలో చిక్కుకుని అందరూ చూస్తుండగానే గల్లంతయ్యాడు. స్నేహితులంతా బయటికి వచ్చి జరిగిన విషయాన్ని చెప్పడంతో కుటుంబ సభ్యులు.. ఈతగాళ్లతో గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది.



చేగువేరాకు నివాళులర్పిస్తున్న నాయకులు

నేటి యువతకు చేగువేరా ఆదర్శం

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: చేగువేరా ఉద్యమ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా అన్నారు. చెగువేరా వర్ధంతి సందర్భంగా శేషగిరిభవన్‌లో ఆయన చిత్రపటానికి బుధవారం నివాళులర్పించారు. నాగుల్‌మీరా, అయ్యూబ్, యాకూబ్‌పాషా, రసూల్, కొచ్చెర్ల జోసెఫ్, భాగ్యలక్ష్మి, అంకుస్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందుగ్రామీణం(కారేపల్లి): దేవులపల్లి యాకయ్యనగర్, స్టేషన్‌బస్తీలో చేగువేరా వర్ధంతిని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలేటి కిరణ్ కుమార్, మన్యం మోహన్‌రావు, రాము, రాందాస్, మాధవి, కుమారి, సుజాత, వెంకన్న పాల్గొన్నారు.

మహా పాదయాత్రతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్



'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్' ధ్రువపత్రాన్ని చూపుతున్న డా.గొల్లపూడి వీరేంద్రచౌదరి

తిరుపతి (భవానీనగర్) న్యూస్‌టుడే: రామన్న-వెంకన్న మహాపాదయాత్ర పేరుతో ఇప్పటివరకు ఏడుసార్లు భద్రాచలం నుంచి తిరుమల శ్రీవారి సన్నిధికి కాలినడక వచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నట్లు డా.గొల్లపూడి వీరేంద్రచౌదరి తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాట్లాడారు. సెప్టెంబర్ 19న 11 మందితో మహాపాదయాత్రను ప్రారంభించి, ఈనెల అక్టోబరు 7న తిరుమలకు చేరుకున్నట్లు ఆయన చెప్పారు. 619 కి.మీ దూరాన్ని 19 రోజుల్లో చేరుకోవడంతో 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో తన పేరు నమోదు అయ్యిందన్నారు. స్వామివారి దర్శనానంతరం శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.10 లక్షల విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి పుష్కర్ కుమ్ర వీరేంద్రచౌదరికి ధ్రువపత్రం అందజేసి సత్కరించారు.

15న 'సీఎం కప్' టార్చ్ రిలే పరుగు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ప్రారంభమైన 'సీఎం కప్' టార్చ్ రిలే ప్రదర్శన ఈ నెల 15న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చేరుకోనుంది. ఈ సందర్భంగా కొత్తగూడెంలో ప్రదర్శన నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల జిల్లా అధికారి పరంధామరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు లక్ష్మీదేవిపల్లి సెంట్రల్ పార్కు నుంచి ప్రకాశం మైదానం వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు. పీఈటీలు, పీడీలు, క్రీడా సంఘాల బాధ్యులు, క్రీడాకారులు, విద్యార్థులు, యువజన సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరుకావాల్సిందిగా డీవైఎస్‌వో కోరారు.

కాన్షీరాం వర్ధంతి



కాన్షీరాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కామేశ్, నాయకులు

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: బహుజన ఉద్యమ సిద్ధాంత కర్త, రాజకీయ వ్యూహకర్త కాన్షీరాం వర్ధంతి కార్యక్రమాన్ని బీఎస్పీ ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్‌లో బుధవారం నిర్వహించారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.కామేశ్, గంధం మల్లికార్జున్‌రావు, నరేశ్, వీరు, రవికుమార్, వెంకన్న, సత్య వరప్రసాద్ తదితరులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

సీపీఐలో పలువురి చేరిక

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: వనందాస్‌గడ్డకు చెందిన బానోతు శ్రీను, అర్జున్, సక్రు, సురేశ్, రమేశ్, మహేశ్, బిక్కులాల్ నాయకత్వంలో పలు కుటుంబాలు సీపీఐలో బుధవారం చేరాయి. స్థానికంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఆయా కుటుంబాలకు సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా ఆహ్వానం పలికారు. నాయకులు భూక్యా శ్రీనివాస్, మునిగడప పద్మ, వెంకటేశ్వర్లు, జనార్దన్, గుత్తుల శ్రీను పాల్గొన్నారు.

మానవ హక్కులు, చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న హ్యూమన్ రైట్స్ సొసైటీ వ్యవస్థాపకుడు ఆనందం

జూలూరుపాడు, న్యూస్‌టుడే: ప్రతి మనిషి తన హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మానవ హక్కుల సొసైటీ వ్యవస్థాపకుడు ఆదూరి ఆనందం పేర్కొన్నారు. జూలూరుపాడు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. సొసైటీ రాష్ట్ర కన్వీనర్, న్యాయ సలహాదారు ఇనపనూరి మహేందర్‌నాథ్ మాట్లాడుతూ... కోర్టు కేసులు, సెక్షన్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రవికుమార్, మణి, మోదుగు వినోద్‌కుమార్, విజయారావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయండి

ఇల్లెందుగ్రామీణం(కారేపల్లి): భవన నిర్మాణ కార్మికులకు పథకాలు అమలు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి కోరారు. ఇల్లెందు సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బుధవారం మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి లేబర్‌కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షలు అందించాలన్నారు. జిల్లాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గౌని నాగేశ్వరరావు, డి.ప్రసాద్, నరసింహారావు, భాస్కర్, లాలయ్య, చంద్ర, రమేశ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రామశాఖల పోరాటం

సుజాతనగర్, న్యూస్‌టుడే: పోరాటాలతో స్థానిక సమస్యల పరిష్కారానికి గ్రామశాఖలు కృషిచేస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర నాయకులు కాసాని అయిలయ్య అన్నారు. సింగభూపాలంలో బుధవారం జరిగిన గ్రామ శాఖ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బుగ్గవీటి సరళ, మండల కార్యదర్శి వీర్ల రమేశ్, లిక్కి బాలరాజు, తిరుపతిరావు పాల్గొన్నారు.


ఉద్యోగాల భర్తీలో ఎస్సీ వర్గీకరణ అమలుకు డిమాండ్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: డీఎస్సీ పోస్టుల భర్తీలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా అన్యాయం చేశారని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు అన్నారు. నల్లబ్యాడ్జీలు ధరించి పాల్వంచ అంబేడ్కర్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై సానుకూలత వ్యక్తం చేసిందని నాయకులు అన్నారు.

బోనస్ చెల్లించాలని కార్మికుల సమ్మె

టేకులపల్లి, న్యూస్‌టుడే: దసరా బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాత్రి షిఫ్టులో కేఓసీ ఓబీ కార్మికులు మెరుపు సమ్మె చేపట్టారు. కార్మికులకు నెలవారీ వేతనంతో పాటుగా దసరా బోనస్ చెల్లించాలని ఓబీ నిర్వాహక ఎల్‌ఎస్‌ఎన్ యాజమాన్యానికి తెలియజేశామని కార్మికులు తెలిపారు. నెలవారీ వేతనం మాత్రమే ఇస్తామని, కంపెనీ బోనస్‌ను డిసెంబరులో చెల్లిస్తామని యాజమాన్యం చెబుతోందని కార్మికులు ఆరోపించారు. ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు డి.ప్రసాద్ సమ్మెకు మద్దతు ప్రకటించారు.

చేనుకు దిష్టి తగలకుండా..



ఈ చిత్రాన్ని చూసి చేనులో ఎవరో మోడ్రన్ డ్రెస్ వేసుకున్న యువతి పత్తి చేనులో పనిచేస్తోందని అనుకుంటే పొరపాటే. చేనుకు దిష్టి తగలకుండా సుజాతనగర్‌లో ఓ రైతు ఇలా బొమ్మను ఏర్పాటు చేసి.. మోడ్రన్ డ్రెస్, టోపీ పెట్టాడు. అటుగా వెళ్లే వారంతా బొమ్మను ఆసక్తిగా చూస్తున్నారు. – పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే

ఆకలి తీర్చే అడవి పూలు!



బతుకమ్మ పండుగ నేపథ్యంలో అడవిలో పూసే పూలకు గిరాకీ పెరిగింది. మారుమూల గిరిజన గ్రామాల నుంచి తంగేడు, టేకు, సీతమ్మ జడలు, బంతి పూలు, గడ్డిపూలు సేకరించే గిరిజనులు వాటిని కొత్తగూడెం త్రీ టౌన్ సెంటర్‌లో విక్రయిస్తున్నారు. దసరా సెలవులు కావడంతో పిల్లలతో సహా పండుగ వరకు ఇక్కడే మకాం వేసి పూల విక్రయాలతో రోజుకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు సంపాదిస్తున్నారు. గురువారం సద్దుల బతుకమ్మ కావడంతో పూల విక్రయాలు జోరుగా సాగాయి. ఇల్లెందుకు చెందిన ఓ అవ్వ అటు బేరం సాగిస్తూనే.. ఇంకోవైపు తన మనవరాలికి అన్నం తినిపిస్తున్న ఈ దృశ్యాన్ని బుధవారం 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. – కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే



కొత్తగూడెం పట్టణం: బతుకమ్మలకు పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ బి. రోహిత్‌రాజు



కొత్తగూడెంలో బంతిపూల విక్రయాలు

ఘనంగా 'సురక్షా బతుకమ్మ' వేడుకలు

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: కొత్తగూడెం హేమచంద్రాపురంలో జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో 'సురక్షా బతుకమ్మ' వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఎస్పీ బి.రోహిత్‌రాజు గౌరీదేవికి పూజలు చేసి వేడుకలను ప్రారంభించారు. మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రకృతితో మమేకమయ్యే పూల పండుగను సిబ్బందితో కలిసి నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని ఎస్పీ ఈ సందర్భంగా అన్నారు. అనంతరం సిబ్బందితో కలిసి బతుకమ్మలాడారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ టి.సాయిమనోహర్, ఇల్లెందు, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు డీఎస్పీలు చంద్రభాను, రెహ్మాన్, సతీశ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ పాల్గొన్నారు.

బతుకమ్మ ఘాట్ పనుల పరిశీలన

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని ముర్రేడు వాగు సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఘాట్‌ను డీఎస్పీ అబ్దుల్ రెహ్మాన్, బతుకమ్మ, దసరా ఉత్సవ కమిటీ సభ్యులు కాంగ్రెస్ నాయకుడు కోనేరు సత్యనారాయణ(చిన్ని), పూర్ణచందర్‌రావు తదితరులు బుధవారం పరిశీలించారు. వేడుకల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను నిర్వాహకులు డీఎస్పీకి వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దబాబు, మసూద్, మహేశ్, ఐకి సత్యనారాయణ, అన్వర్‌పాషా పాల్గొన్నారు.

★ బతుకమ్మ వేడుకలకు శ్రీనగర్ పంచాయతీ ముర్రేడు వాగు వంతెన వద్ద ఘాట్ ఏర్పాటు చేస్తున్నారు. ఆయా పనులను ఎంపీవో శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. వేడుక ఏర్పాట్లు, బారికేడ్ల నిర్మాణంపై పంచాయతీ కార్యదర్శి వెంకట్, సిబ్బందికి సూచనలు చేశారు.



గూడెంలో అడవి నుంచి సేకరించి విక్రయిస్తున్న తంగేడు పూలు



లక్ష్మీదేవిపల్లి: డీఎస్పీ రెహ్మాన్‌తో మాట్లాడుతున్న కోనేరు చిన్ని, కమిటీ సభ్యులు



కొత్తగూడెం గ్రామీణం: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్



పాల్వంచ: పూజల్లో పాల్గొన్న డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు దంపతులు

దుర్గామాత మండపాల్లో విశేష పూజలు

కొత్తగూడెం గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్తగూడెం మేదరబస్తీలోని అమ్మవారి మండపంలో వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఆయన్ను సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు గుగులోత్ కృష్ణ, రాయల శాంతయ్య, పల్లపు వెంకటేశ్వర్లు, మాళోత్ బలరాం, నరసింహారావు, రవీందర్ పాల్గొన్నారు.

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రుల సందర్భంగా కొత్తగూడెం పట్టణంలోని గణేశ్ టెంపుల్, భజనమందిర్, త్రిమాత శక్తి ఆలయం, సింగరేణి మెయిన్ ఆసుపత్రి దేవాలయం, పాత కొత్తగూడెం మార్వాడీ క్యాంప్‌లోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంతో పాటు శరన్నవరాత్రుల మండపాల్లో సరస్వతీ పూజను బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

★ బూడిదగడ్డ బస్తీలో భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆయుధ పూజను బుధవారం ఘనంగా నిర్వహించారు. భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ మెరుగు చింటేశ్వర్, సహాయ సంయోజక్ కె.సాగర్, కిరణ్, సన్నీ అన్వేష్, మహేశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పాల్వంచ పట్టణం బొల్లోరిగూడెం, కేటీపీఎస్ కాలనీలు, పాత పాల్వంచలోని మండపాల్లో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.



సుజాతనగర్: సరస్వతీ అలంకారంలో అమ్మవారు..



ఇల్లెందు గ్రామీణం: స్టేషన్‌బస్తీలో..

నేడు, రేపు కార్మికులకు సహపంక్తి భోజనాలు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

అధికోత్పత్తి దిశగా కార్మోన్ముఖులను చేయడమే లక్ష్యం



సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాల్లో కార్మికులకు వాటాను చెల్లించింది. ఇదే సమయంలో ఆందోళనకరంగా సాగుతున్న బొగ్గు ఉత్పత్తి తీరును మెరుగుపరిచేందుకు కార్మికులను సంస్థ కార్యోన్ముఖులను చేస్తోంది. అధికోత్పత్తి లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా దసరా సందర్భంగా గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద నేడు (గురువారం), రేపు సహపంక్తి భోజనాల కార్యక్రమాల్ని ఏర్పాటు చేస్తోంది. ఈ సమయంలో అధికోత్పత్తి సాధించేందుకు చేపట్టాల్సిన చర్యలపై వారిని చైతన్యపర్చనున్నారు.

ప్రస్తుత ఉత్పత్తి సంవత్సరం లక్ష్యంలో ఇప్పటి వరకు సింగరేణి 90 శాతం బొగ్గు లక్ష్యాన్ని మాత్రమే సాధించింది. వచ్చే ఏడాది మార్చి నెలాఖరుతో ఉత్పత్తి సంవత్సరం ముగుస్తుంది. కేవలం ఐదున్నర నెలల వ్యవధి మాత్రమే మిగిలి ఉంది. ఈ లోగా లోటును పూడ్చుకొంటూ శత శాతం లక్ష్యాన్ని సాధించాలన్నది సింగరేణి యాజమాన్యం ఆలోచన. దీన్ని కార్మికులతో పంచుకునే ఉద్దేశంతో రెండ్రోజుల పాటు గనులు, డిపార్ట్‌మెంట్లలో సహపంక్తి భోజనాల కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోంది. 11న విందు భోజనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గత ఆదివారం హైదరాబాద్‌లో ప్రకటించారు. అధికోత్పత్తి, ఉత్పాదకతను సాధించేందుకు తీసుకోవాల్సిన పలు కార్యక్రమాలను విందు భోజనాలకు ముందుగా వివరించనున్నారు. సంస్థ ముందున్న సవాళ్లు, వాటిని ఎలా ఎదుర్కోవాలో చర్చిస్తారు. బహుముఖ విస్తరణలో భాగంగా చేపడుతున్న ప్రాజెక్టుల వివరాలు వెల్లడిస్తారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అభివృద్ధి, లిథియం ఉత్పత్తికి విదేశీ కంపెనీలతో జరిగిన ఒప్పందం, మల్టీస్పెషాలిటీ వైద్యశాలల ఏర్పాటు తదితర అంశాలు ఇందులో ఉంటాయి. ప్రస్తుత కార్యక్రమాల్లో కార్మికులను చైతన్యపర్చేందుకు నిర్ణయించినట్లు సంస్థ సీఎండీ ఎన్.బలరాం 'న్యూస్‌టుడే'తో అన్నారు.

కార్యక్రమాలపై భిన్నాభిప్రాయం

విందు భోజనాల కార్యక్రమాలను దసరా మరుసటి రోజు నుంచి ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అభిప్రాయం కార్మికుల్లో వ్యక్తమవుతోంది. ప్రతి గని, డిపార్ట్‌మెంట్ వద్ద అమ్మవారి దేవాలయాలుంటాయి. నవరాత్రుల్లో భాగంగా నేడు, రేపు ఆలయ కమిటీలు సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ క్రమంలో పండుగ తర్వాత ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పలువురు పేర్కొంటున్నారు. కానీ, ప్రభుత్వ సూచన ప్రకారం నిర్ణీత తేదీల్లో విందు కార్యక్రమాల్ని చేపడుతున్నట్లు సీఎండీ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

టేకులపల్లి, న్యూస్‌టుడే: శంభునిగూడెం, చంద్రుతండా సమీపంలోని ముర్రేడువాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను గోల్యాతండా-వెంకట్యాతండా సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పోగుల సురేశ్ బుధవారం తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లను తహసీల్దార్‌కు అప్పగించామని చెప్పారు.

వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: కొమరారంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గుండాల మండలం శంభునిగూడేనికి చెందిన ఈసం సమ్మయ్య గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై కొమరారం వస్తున్నారు. ఇల్లెందు మండలం లచ్చగూడెం యాపలగడ్డకు చెందిన చింత నవీన్, మరో ఇద్దరితో ద్విచక్రవాహనంపై వస్తుండటంతో ప్రమాదం చోటు చేసుకుంది. తీవ్రంగా గాయపడిన సమ్మయ్యను స్థానికులు 108లో ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. మెరుగైన చికిత్సకు ఖమ్మం తరలించారు.

గృహోపకరణాలు దగ్ధం

సుజాతనగర్, న్యూస్‌టుడే: మండలంలోని సీతంపేట కాసాని లక్ష్మీనగర్ కాలనీకి చెందిన చింతకాయల రమ్యశ్రీ నివాసంలో బుధవారం షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విలువైన గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. రెవెన్యూ అధికారులు బాధితురాలి నివాసాన్ని పరిశీలించారు.